GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 7 | సంచిక : 268 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | గురువారం 27-03-2025 | పేజీలు : 3

## రేషన్ కార్డుదారులకు మంత్రి అదిరిపోయే శుభవార్త

**-బియ్యంతో పాటు నిత్యవసర సరుకులు**





**టీ మీడియా, మార్చి 26, హైదరాబాద్ :** తెలంగాణ రేషన్ కార్డుదారులకు అదిరిపోయే శుభవార్త చెప్పారు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి బియ్యంతో పాటు నిత్యవసర సరుకులు ఇకపైన పూర్తి స్థాయిలో అందిస్తామని ఆయన అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. చౌక ధరల దుకాణాల్లో ఇకనుంచి రేషన్ బియ్యంతో పాటు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తామని మంత్రి తెలిపారు. లబ్ధిదారులు ఇకపైన రేషన్ షాపుల్లో నిత్యవసర సరుకులు తీసుకువెళ్లాలని కోరారు. రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం కూడా పంపిణీ చేయబోతున్నట్లు వెల్లడించారు. అలాగే ఎస్ఎల్బీసీలో కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్ పై కూడా కీలక ప్రకటన చేశారు. ఇప్పటివరకు రెండు మృతదేహాలను వెలికి తీసినట్లు వెల్లడించారు. మిగిలిన డెడ్ బాడీలను త్వరలోనే బయటకు రెస్క్యూ టీం తీసుకువస్తుందని తెలిపారు. సహాయక చర్యలు పూర్తికాగానే ఎస్ ఎల్ బీసీ ప్రాజెక్టు పూర్తి చేస్తామని ఆయన వెల్లడించారు.

# బెట్టింగ్ యాప్‌ల పై... కఠిన చర్యలు



- నిరోదానికి సిట్ ఏర్పాటు
- బోగస్ కంపెనీకిచ్చిన భూమి వెనక్కి తీసుకొన్నము

అసెంబ్లీ లోసీఎం రేవంత్ రెడ్డి

**టి మీడియా, మార్చి 26,హైదరాబాద్ బ్యూరో :** ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రత్యక్షంగా నిర్వహించినా, పరోక్షంగా ప్రోత్సహించినా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హెచ్చరించారు. ఇలాంటి వాటిని నిరోధించడానికి, నిషేధించడానికి పూర్తి స్థాయి అధికారాలతో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. శాసనసభలో బడ్జెట్ పద్దులపై చర్చ సందర్భంగా సభ్యుల నుంచి వచ్చిన ప్రస్తావనపై ముఖ్యమంత్రి గారు జోక్యం చేసుకుని, ఆన్‌లైన్ బెట్టింగ్, ఆన్‌లైన్ గేమింగ్, ఆన్‌లైన్ రమ్మీ వంటి వాటి విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు.కేవలం ప్రచారం కల్పించే వారిని విచారించడం ద్వారా ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదు. ఈ బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల వల్ల ఎంతో మంది బలవుతున్నారు. కేవలం రాష్ట్రంలో చర్యలు తీసుకున్నంత మాత్రాన సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదు. ఇతర రాష్ట్రాలతో పాటు దేశ విదేశాల నుంచి ఆపరేట్చేస్తున్ననిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి.వీటిని నిషేధిస్తూ 2017 లో చట్టం చేసినప్పటికీ పకడ్బందీగా అమలు చేయడంలో కొంత నిర్లక్ష్యం జరిగింది. ఈ మధ్య కాలంలో చాలా వేగంగా దుర్వినియోగం జరుగుతోంది. రాష్ట్ర స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు వివిధ రకాల సంస్థలు, వ్యక్తులు, వివిధ దేశాలకు చెందిన నేరగాళ్లు ఇందులో పాల్గొంటున్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వాహకులకు చట్టంలో కఠినమైన శిక్షలు కూడా లేవు. శిక్షను పెంచుతూ చట్టంలో అవసరమైన మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్, ఆన్ లైన్ రమ్మీ మాత్రమే కాదు. గంజాయి, కొకైన్, కోడి పందాల్లాంటి ఇతర వ్యసనాలకు కూడా తెలంగాణలో తావులేదు. తెలంగాణను ఒక ఆదర్శవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకు పోతున్నాం. ధరల నియంత్రణలో, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో తెలంగాణ ముందున్నది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తామెక్కడా డాంబికాలకు గొప్పలకు పోకుండా వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టే విధంగా రూపొందించాం. చేసేదే చెప్పాం. చెప్పిందే చేస్తామన్న విధానంలో బడ్జెట్‌ను నియంత్రించాం.

గచ్చిబౌలిలోని భూమి సెంట్రల్ యూనివర్సిటీ పరిధిలోనిది కాదు. యూనివర్సిటీకి ఎలాంటి సంబంధం లేదు. గతంలో ఐఎంజీ భారత్ అనే ఒక బోగస్ కంపెనీకి కేటాయించిన భూమిని 2006 లో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసింది. దాదాపు 25 సంవత్సరాల పాటు న్యాయస్థానాల్లో కేసు పెండింగ్‌లో ఉంది. గత ప్రభుత్వంలో ఆ భూమిని వెనక్కి తిరిగి తీసుకోవాలన్న ప్రయత్నాలు చేయలేదు. తాను అధికారం చేపట్టిన తర్వాత సుప్రీంకోర్టులో పోరాడి ఆ కేసు గెలిచి భూమిని వెనక్కి తీసుకున్నాం. అభివృద్ధిలో భాగంగా ఆ భూమిని టీజీఐఐసీకి కేటాయించాం. అక్కడ ఐటీ కంపెనీలు, ఇతర పరిశ్రమలు రావడానికి ఒక స్పష్టమైన ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి ప్రణాళిక తయారు చేయమన్నాం. రకరకాల ప్రచారాలు చేస్తున్నట్టు అది రిజర్వు ఫారెస్ట్ కాదు.కాలుష్య కారక ఫార్మా పరిశ్రమలను కాదని, నెట్ జీరో సిటీ చేయాలన్న ఒక మంచి సంకల్పంతో 4 కోట్ల తెలంగాణ ప్రజల కోసం ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నాం. పరిశ్రమల ఏర్పాటు, ఇతరత్రా భూసేకరణకు సంబంధించి భూమి కోల్పోతున్న వారి బాధను దృష్టిలో ఉంచుకొని వారికి ఏ రకంగా నష్టపరిహారం చెల్లిద్దామన్న విషయంలో సూచనలు ఇవ్వాలి. భూములను కోల్పోతున్న వారిని ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిది. అలాంటి కుటుంబాలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిద్దాం" అని ముఖ్యమంత్రి వివరించారు.

# కుప్పకూలిన ఐదంతస్తుల భవనం..!

**- ఆరుగురు మృతి**

**టి మీడియా, మార్చి 26, భద్రాచలంప్రతినిధి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో నిర్మాణంలో ఉన్న ఐదంతస్తుల భవనం పేకమేడలా కుప్పకూలింది. ఈ ఘటనలో ఆరుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీపతి శ్రీను అనే వ్యక్తి జీ ప్లస్-2 భవన నిర్మాణం కోసం పర్మిషన్ తీసుకని ఐదంస్తులు కడుతున్నారు. అక్రమ నిర్మాణాన్ని ఆపేయాలని మునిసిపల్ అధికారులు ఇచ్చిన నోటీసులను బేఖాతరు చేస్తూ అక్రమ నిర్మాణం చేపట్టారు. దీంతో ఈ ఘోరం జరిగిందనే ఆరోపిస్తున్నారు స్థానికులుకుప్పకూలిన భవనం భద్రాచలం పంచాయతీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉంది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టారు. ఈ అక్రమ నిర్మాణంపై ఇటీవల సామాజిక కార్యకర్త అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రమాదం పొంచివుందని అప్రమత్తం చేశారు. అయితే ప్రశ్నించిన సామాజిక కార్యకర్తతో సదరు ఇంటి యజమాని శ్రీపతి శ్రీను ఆయన కుటుంబం దురుసుగా ప్రవర్తించారు.ఇదిలావుంటే, ఫిర్యాదుల క్రమంలో ఇంటి నిర్మాణాన్ని కూల్చివేయాలని గతంలో ఆదేశాలు జారీ చేశారు మునిసిపల్ అధికారులు. కానీ భవన యజమాని శ్రీపతి శ్రీను అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ అక్రమ నిర్మాణాన్ని కొనసాగించారు. ట్రస్ట్ పేరిట విరాళాలు సేకరించి భవన నిర్మాణం చేపట్టారు. %+% ప్లస్ 2కి పర్మిషన్ తీసుకుని ఐదంతస్తులు కడుతున్నట్లు ప్రాథమిక విచారణలోనూ చేసింది. నిర్మాణ పనులు జరుగుతుండగా భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. పలువరికి తీవ్రగాయాలయ్యాయి.ఈ ఘటనకు సంబంధించి సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. రెస్క్యూ సిబ్బంది ప్రొక్లెయిన్ సహాయంతో శిథిలాలు తొలగించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తంతరలించిన పోలీసులు, గాయపడ్డవారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. నిర్మాణంలో లోపం వల్లనే ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి భవన యాజమాని శ్రీపతి శ్రీనుపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



కూలకు ముందు



కూలీన తరువాత

## బ్యాంకు ఖాతాలకు 4 నామినీలు

### చట్టాల సవరణ బిల్లుకు పార్లమెంటు ఆమోదం

**టీ మీడియా, మార్చి 26, ఢిల్లీ :** ఇక నుంచి బ్యాంకు ఖాతాదారులంతా నలుగురిని నామినీలుగా పెట్టుకోవచ్చు. బ్యాంకు ఖాతాలతో పాటు ఫిక్స్‌డ్ డిపాజిట్ల(ఎఫ్‌డీ)కూ ఈ రూల్ వర్తిస్తుంది. ఈ మేరకు ప్రతిపాదనలతో కూడిన బ్యాంకింగ్ చట్టాల (సవరణ) బిల్లు-2024కు పార్లమెంటు బుధవారం ఆమోదం తెలిపింది. దీన్ని రాజ్యసభలో మెజారిటీ ఓట్లతో ఆమోదించారు. 2024 డిసెంబరులోనే ఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదముద్ర వేసింది.



మిగతా 3లో..

## అప్రజాస్వామికంగా పార్లమెంట్

**- కనీసం మాట్లాడనివ్వడం లేదు**



**టి మీడియా, మార్చి 26,ఢిల్లీ :** పార్లమెంటు సమావేశాలు అప్రజాస్వామికంగా నడుస్తున్నాయని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. లోక్‌సభలో మాట్లాడేందుకు తనకు కనీసం అవకాశం కూడా ఇవ్వడం లేదని ఆక్షేపించారు. సభ గౌరవాన్ని కాపాడేందుకు సభ్యులు విధివిధానాలు పాటించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కోరిన తర్వాత రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు.స్పీకర్ తనపై వ్యాఖ్యలు చేశారని, తనకు ప్రసంగించే అవకాశం ఇవ్వకుండానే సభను వాయిదా వేశారని రాహుల్ గాంధీ చెప్పారు. గతవారం కూడా ఇలానే తనను మాట్లాడనివ్వలేదని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. సభా కార్యకలాపాలు సజావుగా సాగేందుకు మాత్రం ఇది సరైన మార్గం కాదన్నారు. ఏం జరుగుతోందో తనకు తెలియడంలేదని,

మిగతా 3లో..

## కాకరేపుతున్న మంత్రి పదవి

3లో..

## అర్థం చేసుకోవడానికి 30 ఏళ్లు పట్టింది

**- కూనంనేని వ్యాఖ్యలపై సీఎం చంద్రబాబు**



**టి మీడియా, మార్చి 26, అమరావతి :** సీఎం చంద్రబాబు అధ్యక్షతన రెండో రోజు కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. ఈ సందర్భంగా తెలంగాణ అసెంబ్లీలో సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలు ప్రస్తావనకు వచ్చాయి. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు టూరిజంపై చేసిన వ్యాఖ్యలను కూనంనేని శాసనసభలో ప్రస్తావించారు. ఇప్పుడు సమాజంలో ఏ ఇజం లేదని ఉన్నదంతా టూరిజమేనని ఆనాడు చంద్రబాబు అనేవారంటూ గుర్తుచేశారు. అప్పుడు చెప్పిన మాటే నిజమంటూ కూనంనేని సాంబశివరావు అభిప్రాయపడ్డారు.ఈ మేరకు పత్రికలో వచ్చిన ఆ వార్తను కలెక్టర్ల సదస్సుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు టూరిజం అంశంపై మాట్లాడుతూ ప్రస్తావించారు. ఏ ఇజం లేదని తానంటే కమ్యూనిస్టులు తనపై విరుచుకుపడ్డారని గుర్తుచేశారు. ఇప్పుడు తెలంగాణలో శాసనసభ్యుడు మాట్లాడుతూ ఖర్చు లేని ఇజం టూరిజమేనంటూ నేడు స్టేట్?మెంట్ ఇచ్చారని చెప్పారు. తాను చేసిన మాటలను తన ఆలోచనలను అర్థం చేసుకోవడానికి 30 సంవత్సరాలు పట్టిందని నవ్వుతూ వ్యాఖ్యానించారు . : ఇప్పుడు అంత సమయం లేదని త్వరగా ప్రాజెక్టులు తెచ్చి ప్రజల జీవితాల్లో మార్పులు తేవాలని చంద్రబాబు సూచించారు. రాష్ట్రంలో ఇటు రాయలసీమ నుంచి అటు ఉత్తరాంధ్ర వరకు పర్యాటకం అభివృద్ధికి అనేక అవకాశాలున్నాయని చెప్పారు. కలెక్టర్లు జిల్లాల వారీగా టూరిజం డెవలప్?మెంట్? ప్రాజెక్టులపై శ్రద్ధ పెట్టాలని సూచనలు చేశారు. తద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. అదేవిధంగా ఎకానమీ పెరిగి ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందని వ్యాఖ్యానించారు. ఎక్కువ ఖర్చు లేకుండా ఉపాధి కల్పించే రంగం టూరిజమని వెల్లడించారు. ప్రతి జిల్లాలో కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయని అందుకనుగుణంగా పనిచేస్తే ఇది పెద్ద ఉపాధి మార్గం అవుతుందని చంద్రబాబు వివరించారు.

## ఒళ్లు దగ్గర పెట్టుకోని మాట్లాడాలి

### కేటీఆర్, డిప్యూటీ సీఎం సీఎం మాటల యుద్ధం

### అసెంబ్లీలో దుమ్ముదుమారం.



**టి మీడియా, మార్చి 26, హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు పదోరోజు వాడీవేడిగా కొనసాగుతున్నాయి.. పలు అంశాలపై సుధీర్ఘ చర్చ కొనసాగుతోంది.. ఈ క్రమంలో తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధ్య మాటల యుద్ధం నడిచింది. ప్రభుత్వ పెద్దలు 30శాతం కమీషన్లు తీసుకుంటున్నారంటూ.. స్వయంగా కాంగ్రెస్ నేతలే మాట్లాడుకుంటున్నారంటూ అసెంబ్లీ వేదికగా కేటీఆర్ కామెంట్ చేశారు. అయితే.. కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యల పట్ల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 30శాతం కమీషన్లు తీసుకుంటున్నట్టు నిరూపించాలంటూ కేటీఆర్‌కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సవాల్ చేశారు. నిరూపించలేకపోతే కేటీఆర్ క్షమాపణ చెప్పాలని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు.కేటీఆర్ క్షమాపణ చెప్పాలంటూ కాంగ్రెస్ సభ్యులు ఆందోళన చేశారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలంటూ భట్టి హెచ్చరించారు. దోచుకుంది మీరు.. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది మీరే అంటూ బీఆర్ఎస్ నేతలపై భట్టి మండిపడ్డారు. కాగా.. కేటీఆర్ క్షమాపణ చెప్పాలంటూ కాంగ్రెస్ సభ్యుల ఆందోళన నేపథ్యంలో.. కేటీఆర్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రకటించారు.

### ధరణి వర్సెస్ భూ భారతి

ధరణి, భూ భారతిపై కూడా తెలంగాణ అసెంబ్లీలో రచ్చ జరిగింది. ధరణిపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు ఇంకా అదే చట్టాన్ని అమలుచేస్తున్నారు. ధరణిలో వివరాల ఆధారంగానే ఇప్పటికీ ప్రభుత్వ పథకాల అమలు జరుగుతుందని.. పైగా ఈ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతిలో అనేక లోపాలు ఉన్నాయన్నారు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి. ఈ వ్యాఖ్యల పట్ల అధికార పార్టీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ధరణి ఓ దుర్మార్గమైన చట్టమంటూ డిప్యూటీ సీఎం భట్టి మండిపడ్డారు.పార్ట్-బీ పేరుతో భూములు దోచుకున్నారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఉద్యమాలతో వచ్చిన చట్టాలను ఒక్క కలంపోటుతో వెనక్కు తీసుకెళ్లారు. ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామని ఎన్నికల్లో చెప్పాం .. చెప్పినట్టుగానే భూ భారతిని తీసుకొచ్చామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

# ఇళ్లు, షాపులు అద్దెకు ఇస్తున్నారా?

## -నేరాలు చేసే వారికి ఇస్తే కేసులతో పాటు ప్రాపర్టీ సీజ్



**టీ మీడియా, మార్చి 26, ఆదిలాబాద్ :** ఇళ్లు అద్దెకు ఇచ్చేవారు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. ఎవరైనా ఇళ్లు, గోదాంలు అద్దెకు తీసుకుని ఎవరైన వాటిలో వ్యవస్థీకృత నేరాలు చేస్తే కేసులు నమోదు చేయడంతో పాటు సదరు ఇళ్లు, గోదాములు సైతం పోలీసులు సీజ్ చేస్తారు. అసాంఘిక కార్యకలాపాలను నిరోధించడానికి కఠినంగా వ్యవహరించాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. మట్కా, ఇతర జూద కేంద్రాలు నిర్వహించటానికి, నిషేధిక మద్యం, మాదక ద్రవ్యాలు, రాయితీ బియ్యం నిల్వ చేయటానికి వినియోగించే గోదాములకు ఎవరైనా తమ గృహాలు అద్దెకు ఇచ్చినా సదరు ఇళ్లు, గోదాములు రెవెన్యూ అధికారులకు నివేదించి జప్తు చేయించనున్నారు. చట్ట విరుద్ధంగా వ్యవస్థీకృత నేరాలు చేయడానికి వినియోగించే ఇళ్లను పోలీసులు గుర్తిస్తే మొదట కేసు నమోదు చేస్తారు. తర్వాత ఇళ్లను, గోదాములను సీజ్ చేయడానికి ఆర్డీవోకు నివేదిక సమర్పిస్తారు. ఆర్డీవో 152 బీఎన్ఎస్ఎస్ (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత - ఇండియన్ సిటీజన్ సేఫ్టీ కోడ్) ప్రొసీజర్ ప్రకారం సదరు గృహాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేస్తారు.

**నకిలీ విత్తనాలు తయారు చేస్తూ**

ఆదిలాబాద్? జిల్లా దస్నాపూర్‌లో ఒక షెడ్డును కిరాయికి తీసుకొని కొందరు వ్యాపారులు నకిలీ విత్తనాలు తయారు చేస్తుండగా గతేడాది పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా వాటిని తయారు చేస్తున్న ముగ్గురు వ్యాపారులపై కేసులు నమోదు చేసి జైలుకు పంపించారు. అద్దెకు ఇచ్చిన షెడ్డును సైతం రెవెన్యూ అధికారులతో సీజ్ చేయించారు.

**గుట్కా నిల్వలు చేయగా సీజ్**


గతేడాది అదే జిల్లాలోని పురపాలక సంఘం కార్యాలయ సమీపంలోని ఒక గోదాంలో భారీగా గుట్కా నిల్వలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గుట్కా నిల్వ చేసిన వారిపై కేసులు నమోదు చేశారు. అంతేకాక నిషేధిత ఉత్పత్తులను నిల్వ చేయడంతో సదరు గోదాంను అప్పట్లో సీజ్ చేశారు.

**చట్టవిరుద్ధంగా ఆవుల సరఫరా**

ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పల్లి కాలనీలో ఒక పశువుల పాకను ఆవులను ఉంచటానికి అద్దెకిచ్చారు. పలు గ్రామాల నుంచి గోవులను కొనుగోలు చేసి ఆ పశువుల పాకలో ఉంచి ఇతర ప్రాంతాలకు చట్టవిరుద్ధంగా తరలిస్తుండేవారు. ఈ విషయం తెసులుకున్న పోలీసులు వ్యక్తిపై ఆదివారం కేసు నమోదు చేశారు. పశువుల పాకను అద్దెకు ఇచ్చిన వ్యక్తిపైనా కేసు నమోదు చేశారు. మట్కా, ఇతర జూదం, చట్ట విరుద్ధ కార్యక్రమాలకు ఎవరైనా ఇళ్లను అద్దెకిస్తే సీజ్ చేయిస్తామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. ఇంటి యజమానులపైన కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు

# కాకరేపుతున్న మంత్రి పదవి

- వివేక్, ప్రేమ్‌సాగర్‌రావుల మధ్య పోటీ
- అంతుబట్టని అధిష్ఠానం అంతరంగం



**టి మీడియా, మార్చి 26,ఆదిలాబాద్:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మంత్రి పదవి దోబూచులాడుతోంది. రాష్ట్రంలో ప్రస్తుతం మంత్రివర్గ విస్తరణ జరగనున్న నేపథ్యంలో మరోసారి ఈ పదవి ఎవరికి దక్కనుందోనన్న ఉత్కంఠ రేకెత్తింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి మంత్రివర్గంలో ప్రాతినిథ్యం లేకపోవడంతో ఈసారి తప్పకుండా అవకాశం రానుందనే అంచనా వేస్తున్నారు. పది శాసనసభ స్థానాల్లో ఖానాపూర్, మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరులో కాంగ్రెస్ గెలించింది. తొలి మంత్రివర్గ విస్తరణలో మంత్రి జిల్లాకు అవకాశం వస్తుందన్న ఆశ నీరుగారింది. పార్లమెంట్ ఎన్నికల తర్వాత మంత్రి పదవి వస్తుందనుకున్నప్పటికీ రెండో దశ విస్తరణ జరగలేదు. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క దిల్లీకి వెళ్లటం, మంత్రివర్గ విస్తరణ ఉంటుందనే సంకేతాలు వెలువడటం ఆశావాహులతో పాటు జిల్లా పార్టీ శ్రేణులను ఉత్కంఠకు గురి చేస్తోంది. దీంతో వివేక్, ప్రేమ్‌సాగర్‌రావుల మధ్య నువ్వా నేనా అన్నట్లు పోటీ నెలకొంది. దివంగత నేత వెంకటస్వామి తనయులుగా వినోద్, వివేక్‌కు అధిష్ఠానం దగ్గర గుర్తింపు ఉంది. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే దగ్గర సాన్నిహిత్యం ఉన్నప్పటికీ బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ వెళ్లి వచ్చారనే ఓ విమర్శ ఉంది. పార్టీ మారకపోవడం తనకు కలిసి వస్తుందని ప్రేమ్‌సాగర్‌రావు భావిస్తున్నారు. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లి వేదికగా నిర్వహించిన ఆదివాసీ, దళిత, గిరిజన సభను, సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర, ఖర్గే మంచిర్యాల సభల బాధ్యతలు ఆయన తీసుకున్నారనే పేరుంది.

### పార్టీ మారేటప్పుడే కండీషన్

బీజేపీ నుంచి వివేక్ అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ మారే సమయంలోనే ఆయన తనకు మంత్రిపదవి ఇవ్వాలనే షరతు పెట్టిన విషయాన్ని గుర్తుచేస్తున్నారు. రాష్ట్రవ్యాప్త పరిణామాలను పరికిస్తే దళిత వర్గానికి చెందిన వివేక్‌కు అవకాశాలున్నట్టు స్పష్టమవుతోంది. వివేక్, వినోద్ సోదరులు-ప్రేమ్‌సాగర్‌రావు వర్గాల మధ్య ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రాష్ట్ర నాయకత్వం వేచి చూసే ధోరణిని అవలంబిస్తూ వస్తోంది. తాజాగా విస్తరణ చేస్తే మంత్రి పదవి ఎవరికి ఇస్తారనే అంశం కీలకం కానుంది.

### వీరు పేర్లు కూడా పరిశీలన

అవకాశం ఉంటే ఎమ్మెల్యేలు వినోద్, వెడ్మ బొజ్జు పేర్లను పరిశీలించాలని ప్రతిపాదనలు అధిష్ఠానానికి వెళ్లినట్టు తెలుస్తోంది. పార్టీపై నమ్మకంతో ఉన్నందున మంత్రి పదవి ఇవ్వాలని వినోద్ దిల్లీ స్థాయిలో పావులు కదపటం జిల్లా రాజకీయాన్ని కాకరేకెత్తిస్తోంది. మరో పక్క ఆదివాసీ కోటాలో భాగంగా వెడ్మ బొజ్జు పేరు పరిశీలించటమే కాకుండా పదవి కట్టబెడితే అందరికీ సమన్యాయం చేసినట్లవుతుందని ఆయన అనుయాయులు పేర్కొంటున్నారు.



# విదేశాలకు వెళ్లిపోతాం

- సూపర్ రిచ్ భారతీయుల్లో 22% మంది ప్లాన్
- మెరుగైన జీవితం, లాభదాయక వ్యాపారమే లక్ష్యం

**టీ మీడియా, మార్చి 26, ఢిల్లీ :** సూపర్ రిచ్ భారతీయుల ఆలోచనా ధోరణిపై నిర్వహించిన సర్వేలో షాకింగ్ విషయాలు బయటకు వచ్చాయి. వారిలో దాదాపు 22 శాతం మంది భారతదేశాన్ని వదిలి వెళ్లాలని భావిస్తున్నారట. భారత్‌లోని జీవన స్థితిగతులు, వ్యాపార వాతావరణంతో పోలిస్తే విదేశాల్లో అనుకూల పరిస్థితులు ఉన్నాయని వారు తెలిపారు. తాజాగా కోటాక్ ప్రైవేట్, ఎర్నెస్ట్ అండ్ యంగ్ (ఈవై) సంయుక్తంగా 150 మంది అల్ట్రా హై నెట్‌వర్త్ శ్రీమంతులను సర్వే చేయగా ఈ వివరాలు వెల్లడయ్యాయి. తాము అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, కెనడా, యూఏఈలలో స్థిరపడాలని భావిస్తున్నామని సదరు సూపర్ రిచ్ వ్యక్తులు తేల్చి చెప్పారు. యూఏఈలోని గోల్డెన్ వీసా స్కీం ఆకట్టుకునేలా ఉందన్నారు. సర్వేలో పాల్గొన్న ప్రతీ ఐదుగురు భారతీయ అల్ట్రా హై నెట్‌వర్త్ శ్రీమంతుల్లో ఒకరు విదేశాలకు వలస వెళ్లిపోయేందుకు ప్లాన్‌ను రెడీ చేసుకుంటున్నట్లు తేలింది. తమ భారతీయ పౌరసత్వాన్ని కొనసాగిస్తూనే, వీలు కుదిరితే విదేశాల్లో సెటిల్ అయిపోవాలనే ఆలోచన వారి మనసుల్లో ఉందట.

**ప్రధాన కారణాలివే!**

మెరుగైన జీవన ప్రమాణాలు, నాణ్యమైన వైద్యసేవలు, అత్యుత్తమ విద్యా రంగం, ఆరోగ్యవంతమైన జీవనశైలిని కోరుకుంటూ ఈ శ్రీమంతులు వలస వెళ్తున్నారని సర్వే నివేదిక తెలిపింది. వారంతా తమ పిల్లలకు అత్యుత్తమ ఉన్నత విద్యను అందించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఈ సర్వేతో స్పష్టమైంది. "భారత్‌తో పోలిస్తే విదేశాల్లో వ్యాపారాలు చేయడం చాలా సులభతరం. అందుకే మేం ఆ దేశాలకు ప్రాధాన్యం ఇవ్వదలిచాం" అని సూపర్ రిచ్ భారతీయులు సూటిగా చెప్పారు.

**ప్రొఫెషనల్సే ఎక్కువ**

భారత్ నుంచి విదేశాలకు వలస వెళ్లాలని భావిస్తున్న వారిలో వ్యాపారవేత్తల కంటే ప్రొఫెషనల్సే ఎక్కువ సంఖ్యలో ఉన్నట్లు సర్వేలో గుర్తించారు. వయోవర్గం వారీగా పరిశీలిస్తే మన దేశంలోని అల్ట్రా హై నెట్‌వర్త్ శ్రీమంతుల్లో 36-40 ఏళ్లలోపు వారు, 61 ఏళ్లకుపైబడిన వారు విదేశాలకు వలస వెళ్లేందుకు ఎక్కువ ఆసక్తితో ఉన్నారు. 2023 సంవత్సరం నాటికి భారత్‌లో దాదాపు 2.83 లక్షల మంది అల్ట్రా హై నెట్‌వర్త్ శ్రీమంతులు ఉన్నారు. వీరి సగటు నికర విలువ రూ.25 కోట్లకు పైమాటే. వీరందరి సంపదను కలుపుకుంటే దాదాపు రూ.2.83 లక్షల కోట్ల దాకా ఉంటుంది. 2028 నాటికి భారత్‌లో అల్ట్రా హై నెట్‌వర్త్ శ్రీమంతుల సంఖ్య 4.30 లక్షల మందికి చేరుకోనుందని సర్వే నివేదిక అంచనా వేసింది. ఆ సమయానికి వీరందరి వద్ద రూ.359 లక్షల కోట్ల సంపద ఉంటుందని పేర్కొంది. భారత్ నుంచి ఏటా సగటు 25 లక్షల మంది భారతీయులు విదేశాలకు వలస వెళ్తుంటారు. పౌరులు వెళితే సంపద వెళ్లిపోదు .సూపర్ రిచ్ భారతీయుల్లో పలువురు వలస వెళ్లినంత మాత్రాన పెద్ద సమస్య ఉండదు. వారు తమతో పాటు మొత్తం డబ్బును తీసుకెళ్లలేరు. నివాసాన్ని మార్చినంత మాత్రాన డబ్బంతా దేశం దాటుతుందని భావించకూడదు. భారత పౌరులు దేశం నుంచి సంవత్సరానికి సగటున రూ.2.14 కోట్లు (2.50 లక్షల డాలర్లు) మాత్రమే తీసుకెళ్లగలరు. ప్రవాస భారతీయులు మన దేశం నుంచి ఏటా సగటున రూ.8.50 కోట్ల (1 మిలియన్ డాలర్లు) దాకా తీసుకెళ్లొచ్చు" అని కోటక్ మహీంద్రా బ్యాంక్ ప్రెసిడెంట్ గౌతమీ గవాంకర్ తెలిపారు.

# బుల్డోజర్ న్యాయం సమర్ధనీయమే

## - నిందితులకు అర్థమయ్యే భాషలో సమాధానం

## -ముఖ్యమంత్రి యోగీ అదిత్యనాథ్



**టి మీడియా, మార్చి 26, లక్నో:** ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగీ అదిత్యనాథ్ 'బుల్డోజర్ న్యాయాన్ని' సమర్థించుకున్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వ్యక్తులకు, వారికి అర్థమయ్యేలా, వారి భాషలోనే సమాధానం ఇవ్వటం సరైనచర్య అని అన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లో బీజేపీ అధికారం చేపట్టిన 2017 నుంచి ఇప్పటి వరకు ఎలాంటి మతపరమైన అల్లర్లు జరగలేదని సీఎం యోగి తెలిపారు. భారత్‌లో ఇస్లాం ప్రమాదంలో లేదని, వారి ఓటు బ్యాంకు రాజకీయాలు మాత్రమే ప్రమాదంలో ఉన్నాయని విమర్శించారు. హిందువులు సురక్షితంగా ఉన్నప్పుడే భారతీయ ముస్లింలు సురక్షితమనే విషయం గుర్తించుకోవాలని సూచించారు. పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులపై యూపీ సీఎం ఆందోళన వ్యక్తంచేశారు. న్యాయాన్ని నమ్మేవారికి న్యాయం జరుగుతుంది. కొందరు స్వయంగా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుంటే, చాలా సార్లు చట్టం పరిధిలోనే వారికి జవాబు ఇవ్వటం జరుగుతుంది. ఏ విధంగా అర్థమవుతుందో ఆ భాషలోనే వారికి అర్థమయ్యేలా చేయాలి. సంబల్‌లో అన్ని చోట్ల తవ్వి ఆలయాలను గుర్తిస్తాం. ఎన్ని ఉంటే అన్ని వెతుకుతాం. అన్ని బయటికి తీస్తాం. దేవుడు ఇచ్చిన కళ్లతో సంబల్‌లో ఏం జరిగిందో చూడాలని ప్రపంచాన్ని కోరుతాం. దేశంలో ముస్లింలు ప్రమాదంలో లేరు. వారి ఓటు బ్యాంకు రాజకీయం ప్రమాదంలో ఉంది. ఏ రోజైతే భారతీయ ముస్లింలు తమ పూర్వీకులను అర్థం చేసుకుంటారో, ఆ రోజు నుంచి వారిని ఆడించేవారి ఆటలు సాగవు. తమ ఉనికిని కాపాడుకునేందుకు కొందరు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తుంటారు. హిందువులు సురక్షితంగా ఉన్నప్పుడే భారతీయ ముస్లింలు సురక్షితమని గుర్తించుకోవాలి. గతంలో కశ్మీర్‌లో, ఇప్పుడు బంగ్లాదేశ్‌లో ఏం జరిగిందో తెలుసుకదా! పాకిస్థాన్‌లో ఏమైయింది? 1947కు ముందు పాకిస్థాన్, బంగ్లాదేశ్ భారత్‌లో భాగంగా ఉండేవి. ఇది చరిత్ర. భారత్‌లో ఇస్లాం ప్రమాదంలో ఉందని మాట్లాడుతున్నవారు ఇక్కడ హిందువులను కూడా వ్యతిరేకించారు. భారత్‌లోనే వారు హిందువులను వ్యతిరేకిస్తున్నారంటే పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లో ఎలాంటి పరిస్థితులు ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. వారి మానసిక స్థితి ఏమిటో అంచనా వేయవచ్చు' అని యోగి ఆదిత్యనాథ్ అన్నారు.




# మాజీ మున్సిపల్ చైర్మన్ ను పరామర్శించిన రావుల

**౨ ముస్లిం పెద్దలకు రంజాన్ శుభాకాంక్షలు**

**టీ మీడియా, మార్చి 26, వనపర్తి బ్యూరో :** వనపర్తి పట్టణములో రావుల చంద్రశేఖరరెడ్డి మాజీ ఎం.పి బుధవారం విస్తృతంగా పర్యటించారు. ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స తీసుకోని విశ్రాంతి తీసుకుంటున్న మాజీ మున్సిపల్ చైర్మన్ బి.లక్ష్మయ్య ని వారి స్వగృహంలో కలుసుకొని రావుల చంద్రశేఖరరెడ్డి పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముస్లిం పెద్దలు సయ్యద్. అత్తావుల్లా,బాబర్(హరుణ్ రషీద్) ఇంటికి వెళ్లి వారిని సన్మానించి రంజాన్ పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. రావుల చంద్రశేఖరరెడ్డి వెంట గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్ నందిమల్ల. అశోక్,బండారు.కృష్ణ, ఉంగ్లాం. తిరుమల్,ప్రేమ్ నాథ్ రెడ్డి,బీచుపల్లి యాదవ్,డాక్టర్. డ్యానియాల్, నందిమల్ల. రమేష్, ఎం.డి.గౌస్,వహీద్, చిట్యాల.రాము తదితరులు ఉన్నారు.

# కారు,బైక్ ఢీ.. ఇద్దరు మృతి



**టీ మీడియా, మార్చి 26, బేగంపేట్:** ఉదయం 5 గంటల ప్రాంతంలో మహంకాళి పీఎస్ పరిధిలోని ఎస్డి రోడ్ లో, మినర్వా గ్రాండ్ హోటల్ చౌరస్తా వద్ద ఒక బైకు, స్విఫ్ట్ డిజైర్ కారు ఆక్సిడెంట్ జరిగింది. ఇందులో జిహెచ్ఎంసి వేస్ట్ కంట్రోల్ లో పనిచేస్తున్న ప్రణయ్ (18), సీసీ నగర్ బన్సీలాల్ పేట్ అక్షిత్ (21) ఇయర్స్ బాబు జగ్జీవన్ రావ్ కాలనీ బోయగూడా ప్రణయ్ స్పాట్లోనే చనిపోయారు. అక్షిత్ ను గాంధీ హాస్పిటల్ కి తీసు వెళుతుండగా మార్గమధ్యంలో చనిపోవడం జరిగింది. ఇందులో స్విఫ్ట్ డిజైర్ కారు డ్రైవర్ కుర్మయ్య,(32), మహబూబ్ నగర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుంది.

# పెరగనున్న ఎండలు: ఐఎండీ




**టీ మీడియా, మార్చి 26, హైదరాబాద్:** రానున్న రోజుల్లో ఎండ తీవ్రత పెరగనున్నట్లు భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. వాయువ్య భారతదేశంలో వాతావరణ మార్పుల మూలంగా..మధ్య భారత్‌లో ఎండ తీవ్రతలో వ్యత్యాసాలు ఉంటాయని వెల్లడించింది. సాధారణంగా వాయువ్య భారత్‌లో 5 నుంచి 6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అవుతుంది. కానీ ప్రస్తుత పరిస్థితుల రీత్యా 10 నుంచి 12 డిగ్రీల రెట్టింపు ఉష్ణోగ్రత నమోదు కావొచ్చని ఐఎండీ వెల్లడించింది. ఈ తరహా మార్పులు వెస్ట్, మధ్యభారత్‌లో కన్పిస్తాయని పేర్కొన్నారు. వాయువ్యభారత్‌లో వీచే వేడిగాలుల ప్రభావంతో..మైదాన ప్రాంతాల్లో 40 డిగ్రీల శాతం ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని వాతావరణ శాస్త్రవేత్త సోమా సేన రాయ్ తెలిపారు. గత మార్చి నుంచి 2025 ఫిబ్రవరి వరకు నమోదు ఉష్ణోగ్రతల ఆధారంగా వాతావరణ శాఖ రిపోర్టును విడుదల చేసింది. గతంలో పోలిస్తే..ప్రస్తుత ఏడాదికి కనిష్ఠం నుంచి గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి, అంతేకాకుండా తీర ప్రాంతాలతో పోలీస్తే మైదాన ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరగనున్నాయని ఆ నివేదికలో పేర్కొంది.

# పాస్టర్ మృతి.. అన్ని కోణాల్లో దర్యాప్తు

## - చంద్రబాబు ఆదేశం



**టీ మీడియా, మార్చి 26, అమరావతి :** రాజమండ్రి శివారులో పాస్టర్ ప్రవీణ్ కుమార్ మృతిపై వస్తున్న ఆరోపణలపై ఏపీ సీఎం చంద్రబాబు స్పందించారు. పాస్టర్ మృతిపై అన్ని కోణాల్లో దర్యాప్తు జరపాలని ఆదేశించారు. ఈ ఘటనపై రాష్ట్రం హోం మంత్రి అనిత తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ కు ఫోన్ చేసి ఘటనపై ఆరా తీశారు. ఘటన జరిగిన ప్రాంతంలో సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించాలని ఆదేశించారు. రాజానగరం సీఐ వీరయ్యగౌడ్ మాట్లాడుతూ రాజమండ్రి శివారు కొంతమూరు వద్ద రోడ్డు ప్రమాదం జరిగిందని ఈ ప్రమాదంలో పాస్టర్ ప్రవీణ్ మరణించాడని చెప్పారు. హైదరాబాద్ నుంచి బుల్లెట్ పై బయల్దేరిన ప్రవీణ్ అర్ధరాత్రి సమయంలో ప్రమాదానికి గురయ్యారని తెలిపారు. రహదారి పైనుంచి ప్రమాదవశాత్తు కిందకు జారిపోయారని వాహనం అతనిపై పడిపోవడంతో ఆయనకు బలమైన గాయాలయ్యాయని, ఈ ప్రమాదంలో ఆయన ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ఉదయం 9 గంటల వరకు ఆయనను ఎవరూ గమనించలేదని తెలిపారు. మరోవైపు, ప్రవీణ్ కుమార్ మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ క్రైస్తవ సంఘాలు రాజమండ్రిలో ఆందోళన చేపట్టాయి. ఈ నేపథ్యంలో చంద్రబాబు విచారణకు ఆదేశించారు.

# బ్యాంకు ఖాతాలకు 4 నామినీలు

**లాకర్ రూల్స్ :** లాకర్ల నిర్వహణ విషయంలో పాత పద్ధతిలోనే ఒకరికి మించి నామినీలను ప్రాధాన్యతా క్రమంలో కలిగి ఉండొచ్చు. బీమా పాలసీలలోనూ ఇదే తరహాలో నామినీలు ఉంటారనే విషయం మనకు తెలిసిందే. బిల్లులోని మరో సవరణ విషయానికి వస్తే, బ్యాంకులు ప్రతీ రెండో శుక్రవారం, నాలుగో శుక్రవారం బదులుగా ఇక నుంచి ప్రతినెలా 15వ తేదీన, 30వ తేదీన రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. కంపెనీలలోని డైరెక్టర్ల కనీస వాటా మొత్తాన్ని రూ.5 లక్షల నుంచి రూ.2 కోట్లకు పెంచాలని బిల్లులో ప్రతిపాదించినట్లు తెలిసింది. డైరెక్టర్ హోదాలో ఉన్నవారు కంపెనీలో సగటున 10 శాతం ఈక్విటీ షేర్లను కలిగి ఉండొచ్చని ప్రపోజ్ చేశారు. సహకార బ్యాంకుల డైరెక్టర్ల పదవీ కాలాన్ని ఎనిమిదేళ్ల నుంచి పదేళ్లకు పెంచాలనే మరో ప్రతిపాదన కూడా బిల్లులో ఉందని సమాచారం. కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టరుగా ఉండేవారు, రాష్ట్ర సహకార బ్యాంకు బోర్డులోనూ సభ్యుడిగా వ్యవహరించేందుకు వెసులుబాటును కల్పించే ప్రతిపాదన కొత్త చట్టంలో ఉందని అంటున్నారు. ఆడిటర్లకు వేతనాల చెల్లింపులో బ్యాంకులకు స్వేచ్ఛను కల్పించే నిబంధన సైతం చట్టంలో ఉంది.

# గంజాయి లేడి డాన్ సంగీత సాహు అరెస్టు

## -పలు కేసుల్లో నిందితురాలు



**టి మీడియా, మార్చి 26,హైదరాబాద్ బ్యూరో :** పలు గంజాయి కేసుల్లో నిందితురాలిగా ఉండి తప్పించుకుని తిరుగుతున్న లేడీ డాన్ సంగీత సాహును ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఒడిశా రాష్ట్రం ఖుర్దా జిల్లా కాళీకోట్ గ్రామానికి చెందిన సంగీత సాహు నాలుగు సంవత్సరాల నుంచి గంజాయి దందాలో దిగింది. భువనేశ్వర్‌కు దగ్గరగా ఉండటంతో అనేక రాష్ట్రాల గంజాయి వ్యాపారులతో పరిచయాలు చేసుకుంది. తర్వాత గంజాయి సరఫరా చేయడం మొదలు పెట్టిందని పోలీసులు తెలిపారు. గతంలో ధూల్‌పేట్‌లో 29కిలోలు, 11.3 కిలోల రెండు కేసుల్లో పట్టుబడిన నిందితులకు గంజాయిని సరఫరా చేస్తూ గతంలో పట్టుబడింది.

**వాఙ్మూలం ప్రకారం కేసు నమోదు**

ధూల్‌పేట్‌లో శీలాబాయ్, నేహాబాయ్, ఇషికాసింగ్‌తో పాటు మరికొంత మందికి గంజాయిని సరఫరా చేస్తూ పట్టుబట్టారు. వారిచ్చిన వాంగ్మూలంతో ఆమెపై ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. లేడీ డాన్‌పై మొత్తం నగరంలో అయిదు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సంగీత సాహు ఇన్‌స్టాగ్రామ్‌లో సినీనటి లాగా వీడియోలు పోస్టు చేస్తుంది. గంజాయి వినియోగం ఎక్కడ ఉంటే అక్కడికి వెళ్లి వ్యాపారులతో ఒప్పందాలు కుదుర్చుకుంటుంది. ఒడిశా వెళ్లిన ఎస్టీఎఫ్ పోలీసులు అక్కడి పోలీసుల సహకారంతో లేడీడాన్ సంగీతను అరెస్ట్ చేసి నగరానికి తీసుకువచ్చారు. సంగీతను పట్టుకున్న పోలీసులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి. కమలాసర్‌రెడ్డి అభినందించారు.

**రూ.కోటి విలువగల గంజాయి పట్టివేత**

అనుమానం రాకుండా కంటెయినర్‌లో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని రాచకొండ ఎస్వోటీ పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి కోటి రూపాయలకు పైగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మహారాష్ట్ర పూనెకు చెందిన అహ్మద్ గులాబ్ షేక్ విశాఖపట్నం అరకు నుంచి గంజాయి కంటెయినర్‌లో 300 కిలోల గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్వోటీ, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులతో కలిసి ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి షేక్‌ను పట్టుకున్నారు.

**ఆర్థిక సమస్యలతో రూట్ ఛేంజ్**

డ్రైవర్‌గా పనిచేస్తున్న గులాబ్ షేక్ ఆర్థిక ఇబ్బందుల కారణంగా గంజాయి రవాణను వృత్తిగా ఎంచుకున్నాడు. పూనెకు చెందిన వైభవ్, దేవతో గులాబ్ గంజాయి రవాణ ఒప్పందం కుదుర్చుకుని, రవాణ చేస్తున్నట్టు రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబు తెలిపారు. గంజాయి రవాణ వ్యవహారం బయట పడకుండా జాగ్రత్తలు తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి రవాణ చేసే సమయంలో తన వెంట గులాబ్ ఎవరూ ఉండకుండా చూసుకునేవాడని దర్యాప్తులో బయటపడింది. గతంలో కూడా పలు మార్లు నిందితుడు గంజాయి రవాణ చేసినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ మేరకు నిందితుడి వద్ద నుంచి గంజాయితో పాటు డీసీఎం వ్యాన్, సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.

# అప్సర హత్యలో నిందితుడికి జీవిత ఖైదు

## -రూ.10లక్షల జరిమానా



**టీ మీడియా, మార్చి 26, హైదరాబాద్ :** మహానగరంలోని సరూర్‌నగర్ పరిధిలో జరిగిన యువతి హత్య కేసులో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. అప్సర అనే యువతిని అత్యంత దారుణంగా హతమార్చిన ప్రధాన నిందితుడు పూజారికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పునిచ్చింది. సాక్ష్యాలను తారుమారు చేసినందుకు అదనంగా మరో ఏడేళ్ల జైలు శిక్ష విధించింది. అలాగే అప్సర కుటుంబానికి 10 లక్షల రూపాయలు చెల్లించాలని తీర్పులో స్పష్టం చేసింది. తమిళనాడుకు చెందిన అప్సర డిగ్రీ పూర్తి చేసింది. నటన, మోడలింగ్‌పై ఆసక్తితో పలు తమిళ చిత్రాల్లో నటించింది. సినిమా అవకాశాల కోసం 2022 ఏప్రిల్ నెలలో హైదరాబాద్‌కు వచ్చింది. తల్లితో కలిసి సరూర్‌నగర్ ప్రాంతంలోని ఓ ఇంట్లో అద్దెకు ఉండేది. దైవభక్తి కలిగిన అప్సర తరచూ దేవాలయానికి వెళ్తూ ఉండేది. ఆ సమయంలోనే పూజారి సాయికృష్ణతో పరిచయం ఏర్పడింది. అదికాస్త ప్రేమగా మారింది. అప్సరతో పూజారి సాయికృష్ణ నాలుగేళ్లపాటు ప్రేమాయణం సాగించాడు. పెళ్లి చేసుకోవాలని అప్సర ఒత్తిడి చేయడంతో నాలుగుసార్లు హత్యకు ప్లాన్ చేశాడు. చివరికి 2023, జూన్‌లో శంషాబాద్ ప్రాంతంలో అప్సరను హత్య చేసి.. సరూర్‌నగర్‌లోని మైసమ్మ ఆలయ సమీపంలోని మ్యాన్‌హోల్‌లో మృతదేహాన్ని పడేశాడు. వాసన వస్తున్నట్టు గమనించి రెండు ట్రక్కుల ఎర్రమట్టి తెప్పించి దానిపై కాంక్రీట్ వేసి పకడ్బందీగా మూసేశాడు. అయితే పోలీసుల ఎంట్రీతో హత్యోదంతం వెలుగులోకి వచ్చింది. దీంతో కేసు నమోదు చేసిన సరూర్‌నగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పక్కా ఆధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అప్సర హత్య కేసులో సాయికృష్ణను దోషిగా నిర్ధారిస్తూ జీవిత ఖైదు శిక్ష విధించింది రంగారెడ్డి జిల్లా కోర్టు. ఓ హత్య కేసులో 10లక్షల రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని కోర్టు ఆదేశించడం ఇదే మొదటిసారని న్యాయవాది అన్నారు. కోర్టు తీర్పుతో బాధిత కుటుంబం హర్షం వ్యక్తం చేసింది. ఈ సంచలన తీర్పుతో తన బిడ్డ ఆత్మకు శాంతి చేకూరుతుందని అప్సర తండ్రి అన్నారు.

# అప్రజాస్వామికంగా పార్లమెంట్

మాట్లాడేందుకు అనుమతి కోరినా ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకుడికి సభలో ప్రసంగించే అవకాశం ఇవ్వడం సంప్రదాయమని గుర్తు చేశారు. బుధవారం లోక్‌సభ వాయిదా అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ అగ్రనేతలతో సహా 70 మంది ఆ పార్టీ ఎంపీలు స్పీకర్‌ని కలిసి చర్చించినట్లు హస్తం పార్టీ వర్గాలు వెల్లడించాయి. నేను ఎప్పుడు లేచి నిలబడినా మాట్లాడేందుకు అవకాశం ఇవ్వడం లేదు. మేం చెప్పాలనుకొనే అంశాలను లేవనెత్తేందుకు మాకు అనుమతి ఇవ్వడంలేదు. నేనేమీ చేయలేదు. ఒక్కమాట కూడా మాట్లాడకుండా కూర్చున్నా. ఏడెనిమిది రోజుల నుంచి నన్ను మాట్లాడేందుకు అనుమతించడం లేదు. ఇదో కొత్త ఎత్తుగడ. ప్రతిపక్షానికి ఇక్కడ చోటులేదు. ఇటీవల ప్రధాని కుంభమేళా గురించి మాట్లాడినప్పుడు నేను నిరుద్యోగం గురించి మాట్లాడాలనుకున్నా, కానీ మాట్లాడేందుకు అనుమతించలేదు. మమ్మల్ని మాట్లాడేందుకు అనుమతించకపోవడం అప్రజాస్వామికం" అని రాహుల్ గాంధీ అన్నారు.

### నిబంధనలు పాటించాల్సిందే

మరోవైపు, బుధవారం సభా కార్యకలాపాల సమయంలో స్పీకర్ ఓం బిర్లా మాట్లాడుతూ, సభా గౌరవాన్ని కాపాడేందుకు నిబంధనలు పాటించాలని సభ్యులకు సూచించారు. సభలోని సభ్యులు హుందాగా వ్యవహరించాలని సూచించారు. సభ్యుల ప్రవర్తన ఈ సభ ఉన్నత ప్రమాణాలకు అనుగుణంగా లేదని అనేక సందర్భాల్లో తన దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఈ సభలో తండ్రీ కూతురు, తల్లీ కుమార్తె, భార్యా భర్తలు సభ్యులుగా ఉన్నారు. ఇలాంటి సందర్భంలో ప్రతిపక్ష నేత 349 రూల్ (సభలో సభ్యులు పాటించాల్సిన ప్రవర్తనా నియమావళిని సూచించే నిబంధన) ప్రకారం నడుచుకుంటారని తాను ఆశించినట్లు తెలిపారు.